జగన్నాథ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే రమణ దంపతులు

విశాలాంధ్ర - జలుమూరు : జగన్నాథ రథోత్సవ యాత్ర ఉత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం జలుమూరు మండలం మర్రివలస పంచాయతీ బైరాగిపేట గ్రామంలో కొలువైయున్న శ్రీ జగన్నాథ స్వామిని నరసన్నపేట ఎమ్మెల్యే దంపతులు బగ్గు సుగుణమ్మ, రమణ మూర్తి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి దేవాదాయశాఖ కార్యనిర్వహణ అధికారి వి.ప్రభాకర్ రావు స్వాగతం పలికి సత్కరించారు. వారితోపాటు ఆలయ అర్చకులు, మండల ప్రచార కార్యదర్శి బగ్గు గోవిందరావు, ఆ పార్టీ నేతలు పలువురు పాల్గొన్నారు.

విద్యా సంవత్సరానికి ప్రభుత్వ ఐటిఐ ఏర్పాటు : ఎమ్మెల్యే రవికుమార్

విశాలాంధ్ర - ఆమదాలవలస : రానున్న విద్యా సంవత్సరానికి ఆమదాలవలస లో ప్రభుత్వం ఆద్వర్యంలో పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటిఐ) ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం స్థానిక లక్ష్మి నగర్ పాఠశాల లో జరిగిన ఎన్.ఎం.ఎం.ఎస్ స్కాలర్‌షిప్‌లు పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. టెక్నికల్ రంగాల్లో విద్యా వ్యవస్థ మెరుగుపడాలనే ఉద్దేశంతోనే ఐటిఐ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. విద్యారంగం పట్ల బాల బాలికలు ప్రాధాన్యత చూపించడంతో 2018 ఏటా జ్యోతిబాపూలే పాఠశాలను 22 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేశామని వివరించారు. కేజీ టు పీజీ వరకు బాలికలు విద్యాభ్యా సం చేసే విధంగా కళాశాలను తీర్చిదిద్దాలని ఆశయంతో అప్ప టి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మన ప్రతిపాదనను అంగీకరించి మంజూరు చేశారు. ఎన్నికల తర్వాత పరిణామాలతో గత ప్రభుత్వం ఆ పాఠశాల కు భవన మంజూరులో నిర్లక్ష్యం వహించిందని అన్నారు. అలాగే దేశంలోనే అత్యున్నత కోర్సులతో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయడమే లక్ష్యం అని అన్నారు. ఇంజనీరింగ్ కళాశాలకు సంబంధించి సాంకేతిక విద్య పరమైన ఐటిఐ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు వ్యవసాయ, పశు సంవర్ధక పాలిటెక్నిక్ కళాశాలలో కూడా ఉన్నాయని దీంతో ప్రభు త్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు అయితే ఈ ప్రాంత విద్యార్థులు ఇతర ప్రదేశాలకు వెళ్లే అవకాశాలు తక్కువగా ఉంటాయని వివరించారు. నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలోనూ లక్ష్మీ నగర్ పాఠశాల తరహా విద్యాబోధన జరగాలని అందుకు అవసరమైన ఉపాధ్యాయులను సమకూర్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. స్కాలర్షిప్ పొందిన 14 మంది విద్యార్థులకు ట్రిబుల్ ఐటీ లో సీటు పొందిన విద్యార్థులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, ఎంఈఓ లు, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పలాస అభివృద్ధికు కృషి చేయాలి

నారా లోకేష్‌ను కలిసిన గౌతు శిరీష

విశాలాంధ్ర - పలాస : పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరిలు సోమవారం విజయవాడలో రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. పలాస అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సహాకారం అందించాలని కోరారు. ప్రతి చేనుకు నీరు.. ప్రతి చేతికి పని.. అనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని, ఇప్పటికే వంశధార నీటిని రైతులకు అందించడం జరిగిందన్నారు. పలాస ప్రాంతంలో స్కిల్ డెవలప్ మెంట్ కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తీర ప్రాంతం అధికంగా ఉందని, ప్రస్తుత తీరంలోని మత్స్యకార యువతకు సీమెన్, మర్చంట్ నేవీ అంశాలపై శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్దాన ప్రాంతంలో జీడి, కొబ్బరి అధికంగా సాగవుతుందని, అందుకు అనుగుణంగా చిన్న తరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసినట్టయితే ఈ ప్రాంతంలోని మహిళలు అదనపు ఆదాయం పొంది ఆర్థికంగా పరిపుష్టి సాధించే అవకాశం ఉంటుందని వివరించారు. దీని పై మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించి పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే శిరీష తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ఎస్ఎస్ ఫౌండేషన్ ఆవిర్భావం

తొలి రోజున కళ్యాణ మండపం అభివృద్ధికి రూ.2 లక్షలు విరాళం

విశాలాంధ్ర - సోంపేట : సోంపేటకు చెందిన ప్రముఖ సంఘ సేవకుడు, రోటరీక్లబ్ పూర్వ చైర్మన్ డాక్టర్ దుద్ది శ్రీనివాస రావు వ్యవస్థాపక అధ్యక్షునిగా సోమవారం పట్టణంలోని శ్రీలోకనాధీశ్వర ఆలయం వేదికగా శివసాయి సేవా ఫౌండేషన్ ఆవిర్భావం జరిగింది. అనేక మంది సభ్యులతో సామాజిక అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా సేవా ఫౌండేషన్‌ను ప్రారంభిస్తున్నట్లు వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శివాలయంలో పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో పేదల కోసం నిర్మిస్తున్న ఉచిత కళ్యాణ మండపం నిర్మాణానికి శ్రీనివాస్ తన సేవా ఫౌండేషన్ ద్వారా తొలి విరాళంగా 2లక్షల రూపాయల నగదును కళ్యాణ మండపం అభివృద్ధి కమిటీ ప్రతినిధి వూనా తులసీదాస్‌కు సభ్యుల హర్షాతిరేకాల నడుమ అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పచ్చని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక సేవలు, పేదల సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడు ముందు వరుసలో ఉంటానని ఎటువంటి స్వార్థానికి తావు లేకుండా తన సంపాదనలో ప్రతి ఏటా 50శాతం మొత్తాన్ని సేవా ట్రస్ట్ పేరున జమ చేసి దానిపై వచ్చే వడ్డీతో పాటు మరికొంత మొత్తాన్ని తాను వెచ్చించి నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగించడమే సేవా సంస్థ యొక్క ధ్యేయమని అన్నారు. సోంపేటతో పాటు చుట్టుప్రక్కల మురికివాడలు, గిరిజన గ్రామాలు, అభివృద్ధికి నోచని ప్రాంతాల్లో సామాజిక అభివృద్ధి కార్యక్రమాలతో పాటు విద్య, వైద్యం, మొదలైన రంగాల్లో నిరుపేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యులు దుద్ది శ్రీనివాస్‌ను దుశ్శాలువ కప్పి సత్కరించారు.

శాలువాలు, పూలదండలు, పుష్పగుచ్ఛములు తీసుకురావడం మానుకోండి

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర - టెక్కలి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి మరియు మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇకపై తనను కలవడానికి వచ్చిన వారు పూల దండలు, శాలువాలు, పుష్పగుచ్ఛములు తీసుకురావద్దని నాయకులుకు, కార్యకర్తలకు, ప్రజానీకానికి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల ప్రేమాభిమానాలే పదివేల పూలదండలతో సమానమని పేర్కొన్నారు.

సేవలకు బహుమతి

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : విద్యార్థిదశ నుండే, సామాజిక బాధ్యతను ప్రతీ ఒక్కరూ తీసుకోవాలని, లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు డా.బొడ్డేపల్లి.సురేష్, తెలిపారు. లయన్స్ క్లబ్ సెంట్రల్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ చిన్నతనం నుండే సేవా కార్యక్రమాలతో, అవగాహనా కార్యక్రమాలతో అందరి మన్ననలూ చిన్నారి ట్వింకిల్ పొందిందన్నారు. రెండవ కరోనా విపత్తు లో మాస్కులను నగరంలో సుమారు మూడువేలకు పైగా నగర వాసులకు పలు ముఖ్య కూడలిలో అందించి, అవగాహనా కార్యక్రమాలను సైతం చేస్తూ ఔరా అనిపించిందన్నారు. ఈ సందర్భంగా ట్వింకిల్ కు లయన్స్ క్లబ్ సెంట్రల్ శ్రీకాకుళం తరపున బహుమతిగా కొంత నగదును అందించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో మెంటార్ నటుకుల. మోహన్, ఉపాధ్యక్షులు డి .విష్ణుమూర్తి,డిసి బి. దేవా భూషన్, ట్రెజరర్ జోగి భారతి,ఉపాధ్యక్షులు బి. విశ్వేశ్వర రావు,సభ్యులు ఊన్న కిరణ్, బి. ఉమా కవి,పొడుగు చరణ్, ఉర్లం శివతేజ, పి.కామేష్, శిల్లా మణి, టెక్కం రాంగోపాల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విశాలాంధ్ర - పొందూరు : మండల కేంద్రం పొందూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ రోడ్డులో కోళ్ల వ్యాను స్కూటీని బలంగా ఢీకొనడంతో తండ్యాం పంచాయితీ శ్రీ రామ్ నగర్ కాలనీకి చెందిన కాకర్ల దుర్గాప్రసాద్ (26) అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే మృతులు దుర్గాప్రసాద్ చేనేత కార్మిక కుటుంబానికి చెందిన వాడు, తల్లి దండ్రులు కాకర్ల కృష్ణ కొండమ్మకు రెండవ కుమారుడు, గ్రామంలో మంగళవారం వారాలు సందర్భంగా పొందూరు మహారాజా మార్కెట్లో పళ్ళు కాయలు కొనుక్కుని తన స్వగ్రామమైన శ్రీరాం నగర కాలనీకి వెళుతుండగా కోళ్ల వ్యాన్ ఢీకొని మృతి చెందదని, మృతుడు వెనుక కూర్చున్న చిన్నారావుకు చేయి వీరగడంతో శ్రీకాకుళం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దుర్గాప్రసాద్ మృతి చెందిన విషయం తల్లిదండ్రులు కాకర్ల కృష్ణ కొండమ్మలకు తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బిడ్డను కోల్పోయిన దుఃఖంతో తల్లా ఢిల్లీ పోయారు.తల్లిదండ్రుల కన్నీటి ఘోష చూపారులకు గుండె తరుముకు పోయింది. అల్లారి ముద్దుగా పెంచుకున్న రెండో బిడ్డ దుర్గా ప్రసాదును రోడ్డు ప్రమాదంలో మృత్యువు వెంటాడుతుందనుకోలేదంటూ కంటి తడి పెట్టిన స్నేహితులు బంధువులు కన్నీటి ఘోష వర్ణనాతీతం. చిన్నారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కోళ్ల వ్యాన్ డ్రైవర్ను అదుపులో తీసుకున్నారు. శవ పంచనామకు మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతీ ఫిర్యాదు పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికను సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయనతో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఫిర్యాదులను పరిష్కరించాల్సిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని చెప్పారు. జి.సిగడాం మండలం వెలగాడ గ్రామానికి చెందిన పెట్టి ఆదిలక్ష్మి నడవలేని పరిస్థితిని కలెక్టర్ గమనించి ఆయనే ఆమె వద్దకు వెళ్లి ఆమె సమస్య అడుగగా ఆమెకు సంబంధించిన భూ సమస్య గూర్చి కలెక్టర్ కు వివరించగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికకు 191 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతీ జిల్లా అధికారి ప్రతీకూల వార్తలపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. నిర్ణీత సమయంలో పూర్తి సమాచారంతో వివరణ జారీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు, జిల్లా పరిషత్ సి.ఇ.ఓ వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ రామ్మోహనరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : నూతన ఎస్పీ గా కె.వి మహేశ్వర రెడ్డి సోమవారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా చాంబర్ లో బాధ్యతలు చేపట్టారు. ముందుగా జిల్లా ఆర్డ్ పోలీస్ సిబ్బంది ఎస్పీకి గౌరవ వందనం సమర్పించారు. అర్చకులు వేద మంత్రాలు, పూర్ణకుంభం, మంగళ వాయిద్యాలుతో ఆహ్వానించి ప్రత్యేక పూజ కార్యక్రమాలు అనంతరం బాధ్యతలు చేపట్టారు. అదనపు ఎస్పీలు జి.ప్రేమ్ కాజల్, వి.ఉమామహేశ్వర రావు, సెబ్ అదనపు ఎస్పీ డి.గంగాధర్, పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది, కార్యాలయ సిబ్బంది మరియు పోలీసు అసోసియేషన్ సభ్యులు ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందచేశారు. అనంతరం అదనపు ఎస్పీలు, డిఎస్పి లతో కాసేపు జిల్లా పరిస్థితులపై సమీక్షించారు. జిల్లా ఎస్పీ కే.వీ.మహేశ్వర్ రెడ్డి 2019 ఐపీఎస్ బ్యాచ్ నకు చెందిన పోలీస్ అధికారి. ఆయన శిక్షణ కాలం అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లాలో చింతూరు ఏఎస్పి గాను మరియు (ఆపరేషన్స్) ఓఎస్డి గా రొంపచోడవరం లో విధులు నిర్వహించి సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు.

హెల్మెట్ ధారణ యొక్క ఆవశ్యకత ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

విశాలాంధ్ర - టెక్కలి : ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధారణ యొక్క ఆవశ్యకత గురించి తెలుసు కోవాలని టెక్కలి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు డివి వివేకానంద తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం టెక్కలి కోర్టుల సముదాయం నుండి టెక్కలి అంబేద్కర్ కూడలి వరకు ఇన్‌చార్జి చైర్మన్, మండల న్యాయ సేవాధికార సంస్థ మరియు సీనియర్ సివిల్ జడ్జి, టెక్కలి జె శ్రీనివాసరావు సూచనల మేరకు ఆయన ప్యానెల్ న్యాయవాదులు మరియు ఇతర న్యాయవాదులు కలిసి హెల్మెట్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు హెల్మెట్ విధిగా ధరించాలని, హెల్మెట్ లేకపోవడం కారణంగా తలకు తీవ్రమైన గాయాలు తగిలి మరణాలు సంభవిస్తున్నాయని, వాహనము నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిభందనలు పాటించాలని సూచించారు. ఈ సదస్సులో టెక్కలి న్యాయ వాదులు పి సాయిరాజ్, పి.ఆనందరావు, బి.శ్రీనివాసరావు, పి చంద్రశేఖర్ ఆజాద్, ఎస్.రాజన్నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : విద్యార్థులు విద్యుత్ తో పాటు క్రమశిక్షణలో వివిధ ఉత్తమ మార్గాల్లో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఐఎస్ఆర్ఏ వ్యవస్థాపకులు ఎడ్ల.గౌరునాయుడు అన్నారు. సోమవారం దండు గోపాలపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ రంగాలకు సంబంధించిన చైతన్యం చేసే విషయాలను వివరించారు. ఉపన్యాసం ఆద్యంతము విద్యార్థులను ఉల్లాసపరుస్తూ, ఉత్సాహపరుస్తూ చక్కనైన జాగృతి గీతాలతో, మంచి కథలతో విద్యార్థులు భవిష్యత్తుకు ఏవిధంగా ప్రణాళిక వేసుకోవాలి, మంచి నడవడిక ఎలా అలవర్చుకోవాలి అనే దానిపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కోత చైతన్య, ఉపాధ్యా యులు భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, ఆదికేశవరెడ్డి, తిరుపతిరావు, లక్ష్మి, నాగేశ్వరరావు, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరాజు, విజయలక్ష్మి, రవికుమార్, కృష్ణవేణి, మార్కండేయులు, రోజ పాల్గొన్నారు.

ఆరు నెలల పసికందుపై అత్యాచారం చేసిన నిందితుడిని శిక్షించాలి

పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు బతకల ఈశ్వరమ్మ డిమాండ్

విశాలాంధ్ర - పలాస : విజయనగరం జిల్లా రాంభద్రాపురంలో 40 ఏళ్ల కామాంధుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడని, అమానవీయంగా సమాజం సిగ్గుతో తలదించుకునే విధంగా ఆరు నెలల పసికందు పై అత్యాచారం చేసిన కామాంధుడిని కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు. సోమవారం పలాసలో సూది కొండ కాలనీలో సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆరు నెలల పసికందు నుండి 60 సంవత్సరాల వృద్ధులపై అత్యాచారాలు పెరుగుతున్నాయని, ఆడపిల్లల దుస్తుల మీద కామెంట్ చేసిన వారు ఈ పసి కందుపై ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. వ్యవస్థలో స్త్రీల పట్ల ఉన్న దృక్పథం మారాలన్నారు. పాలక వర్గాలు స్త్రీలను అంగడి వస్తువుగా మార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం ఏరులై పారుతుందని, స్త్రీలను వస్తువుగా చూస్తున్న కాలంలో అత్యాచారాలకు పాలకులే దారి ఇచ్చిన వారవుతారని ఆమె అన్నారు. నిర్భయ దిశ వంటి చట్టాలు ఎన్ని తెచ్చిన మద్యపానం నిషేధించకుండా గంజాయి మత్తు పానీయాలను అరికట్టకుండా హింస ప్రవృత్తి సమాజంలో అరికట్టడం అసాధ్యం అన్నారు. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడానికి గల కారణాలను అన్వేషించకుండా వ్యవస్థ మూలాల్లోకి తొంగు చూడకుండా చట్టాల పేరుతో నిందితులకు శిక్షలు పేరుతో ఇవి ఆగవని వ్యవస్థ మూలాలను శోధించి వీటికి పరిష్కార మార్గాలకు పూనుకోవాలని కోరారు. అప్పుడే హత్యలు అత్యాచారాలు ఆగుతాయని ఆ దిశగా పాలకులు ప్రయత్నం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.ఆమెతో పాటుగా జిల్లా కార్యవర్గ సభ్యురాలు కంప సరస్వతి, గౌరమ్మ, సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమాత్యులు అచ్చెన్న దయతో అన్నదాతల్లో ఆనందం

వంశధార జలకళకు పులాభిషేకాలు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : అమాత్యులు కింజరాపు అచ్చంనాయుడు దయతో, అన్నదాతల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. దీంతో వంశధార కాలువల్లో ప్రవహిస్తున్న జలకళలకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు అధ్వర్యంలో పులాభిషేకాలు చేస్తూ, హారతులు ఇచ్చారు. రైతులకు వరి విత్తనాలు వేసే సమయంలో వర్షాలు సరిగ్గా వర్షాలు కురవకపోవడంతో మండలంలో గల రైతులు, నాయకులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, ఎమ్మెల్యే గా ఘనవిజయం సాధించిన వెంటనే, వంశధార కాలువల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన మంత్రి అచ్చంనాయుడు వంశధార ఉన్నతాధికారులతో మాట్లాడి శివారు ప్రాంతాలకు సైతం వంశధార నీరు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో పలు గ్రామాల్లో వంశధార పనులు చక చక జరుగుతున్నాయి. ఇప్పటికే పనులు పూర్తయిన కాలువలలో సంతబొమ్మాళి, బోరుభద్ర, మర్రిపాడు తోపాటు పలు ప్రాంతాల్లో వంశధార నీరు పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తుంది. దీంతో రైతులు నాయకులు, ఆనందంతో సోమవారం ప్రవహిస్తున్న వంశధార కాలువలు వద్దకు వెళ్లి గంగమ్మ తల్లికి పూలాభిషేకాలు చేసి మంగళ హారతులు ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వజ్జ ప్రభాకర్ రావు, కూచెట్టి కాంతారావు, చల్లా జగ్గారావు, తంగి రమణ, అల్లు రమేష్ తో పాటు పలువురు రైతులు నాయకులు ఉన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధారణ తప్పనిసరి

సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ దారుణతో పాటు వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించడంతో ప్రమాదాల నుంచి ఎంతో రక్షణ కలుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు అన్నారు. అతివేగం ప్రమాదాలకు కారణమని వాహనాలు నడిపే వారు వేగం కన్నా ప్రాణం మిన్న అన్న విషయాన్ని మనసులో పెట్టుకొని వాహనాలు నడపాలి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ఆర్. సన్యాసినాయుడు స్థానిక ఎంపీఆర్ లా కళాశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మోటారు చట్టం ప్రజలలో అవగాహన భాగంగా లా విద్యార్థులకు అతి వేగంతో వాహనం ను నడపవద్దని సూచించారు. వేగంగా నడపడం వలన జరిగే ప్రమాదాలు ఎక్కువ అన్నారు. ప్రమాదం వలన జరిగే నష్టం కుటుంబం లో ఒకరిని కోల్పోవడం అని తెలిపారు. హెల్మెట్ పెట్టుకోవడం లో నిర్లక్ష్యం చేయకూడదని ప్రజలలో చైతన్యం కలిగించడం లో యువత పాత్ర ఎంతైనా అవసరం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, కె మోషి, అడ్వకేట్, ఐ పాపయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరంక్షించాలి : ఎమ్మెల్యే మామిడి



విశాలాంధ్ర - ఎల్ఎన్‌పేట : ప్రతీ ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు దోహద పడాలని పాతపట్నం శాసన సభ్యులు మామిడి గోవిందరావు అన్నారు.సోమవారం అధ్వర్యంలో ఎల్ఎన్‌పేట మండలంలో బొర్రంపేట గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అలాగే ప్రతీ గ్రామంలో కూడా మొక్కలు నాటే కార్యక్రమం జరగాలని కొనియాడారు. నియోజకవర్గంలో సుమారు 12వేలు మొక్కలను ఉపాధిహామి ద్వారా పంపిణీ చేసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని కాలుష్య రహిత గ్రామలుగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొయిలాపు క్రిష్ణామాచార్యులు, వెలమల గోవిందరావు, ఒమ్మి ఆనందరావు, కాగాన మన్మధరావు, శివ్వాల తేజేశ్వరరావు, కొమరాపు చిరంజీవులు, సురేష్, అన్నంనాయుడు, భాస్కరరావు, ఉపాధిహామి ఏపీవోలు, టెక్నికల్, ఫిల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పశు వైద్యాధికారి నియామకం జరిగేలా చర్యలు చేపట్టండి

విశాలాంధ్ర - మెళియాపుట్టి : మండల కేంద్రంలో గడిచిన నాలుగు సంవత్సరాలకు పైబడి రెగ్యులర్ పశు వైద్యాధికారి లేక ఇక్కడ రైతులు, పశువుల పెంపకందారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మెళియాపుట్టిలో పశు వైద్య కేంద్రంలో రెగ్యులర్ పశువైద్యాధికారి నియామకం జరిగా చర్యలు చేపట్టాలని కోరుతూ గ్రీవెన్స్ లో తహసిల్దార్ వారికి వినతిపత్రం అందించినట్లు తెలుగు యువత అధ్యక్షులు పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. గడిచిన కొన్ని సంవత్సరాలుగా మండల కేంద్రంలో ఉన్న పశు వైద్యశాలలో రెగ్యులర్ పశు వైద్యాధికారి లేక ఇన్చార్జి పశు వైద్యాధికారి సకాలంలో ఇక్కడికి రాలేకపోతుండడంతో రైతులు, పశువుల పెంపకందారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఇదే విషయమై గతంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నో మార్లు విన్నవించినప్పటికీ నేటికిని ఎటువంటి ప్రయోజనం చేకూరలేదని ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించి మెళియాపుట్టి మండల కేంద్రంలోని రెగ్యులర్ పశు వైద్యాధికారి నియామకం జరిగేలా చర్యలు చేపట్టాలని కోరుతూ గ్రీవెన్స్ లో వినతి పత్రాన్ని అందించారు.

నా బిడ్డను.. అప్పగించే చర్యలు తీసుకోండి..

పోలీసులకు మొరపెట్టుకుంటున్న మహిళ..!

విశాలాంధ్ర - పలాస : రక్షణకు.. భరోసా కు చిరునామా ఏపీ పోలీస్.. రాష్ట్రం లో ఫ్రెండ్లీ పోలీస్ విధానంతో శాంతి భద్రతలు కాపాడటంలో పోలీస్‌లు నెంబర్ వన్‌గా నిలు స్తున్నారు. అయితే అందుకు భిన్నంగా, భర్త వేధింపులు నుండి తనను కాపాడమని పోలీస్‌ల వద్ద మొరపెట్టుకుంటే, ఆ పోలీస్ లే తనకు బెదిరింపులకు పాల్పడుతున్నారని అంటూ ఓ మహిళ రోడ్డెక్కి నిరసన తెలియజేసిన సంఘటన పలాస లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే...పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో అన్నపూర్ణ ఆశ్రమం వీధికి చెందిన నెయ్యిల అరుణకు, ప్రయివేటు ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ జీవిస్తున్న వజ్రపు కొత్తూరు మండలం, సుంకర జగన్నాధపురం గ్రామానికి చెందిన నెయ్యిల లోకేష్ తో 2019 లో వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమారుడు కూడా ఉన్నారు. పెళ్లయిన రెండు నెలలకే భర్త లోకేష్ నుండి తనకు వేధింపులు మొదలయ్యాయని అరుణ సోమవారం విలేకరుల ముందు వాపోయింది. అప్పుడప్పుడు సైకోలా ప్రవర్తించేవాడని, లోకేష్ పెడుతున్న టార్చర్ భరించలేక పెద్ద మనుషులను అనేక సార్లు ఆశ్రయించినట్లు తెలిపింది. పెద్ద మనుషులు సైతం తన ఆవేదన అర్థం చేసుకోకుండా ఇద్దరు కలిసి ఉండాలంటూ, లేకుంటే కోర్టు లో తేల్చుకోండని అంటూ సెలవిచ్చి, సర్ది చెప్పి పంపించేవారు. రోజు రోజుకు భర్త లోకేష్ వేధింపులు పెరిగిపోవడంతో భరించలేక సుంకరి జగన్నాధపురం నుండి వచ్చి పలాస అన్నపూర్ణ ఆశ్రమ వీధిలో ఉంటున్న అమ్మ వారి ఇంట్లో ఉంటున్నట్లు అరుణ తెలిపింది . భర్త లోకేష్ నుండి తనకు రక్షణ కల్పించాలని, నాలుగేళ్ళ కుమారుడిని తనకు ఇప్పించాలని పలుమార్లు పలాస పోలీస్ స్టేషన్ లో పిర్యాదు లు చేసిన పట్టించుకోకపోవడంతో జిల్లా ఎస్పీ కి పిర్యాదు చేసి, తన గోడును మొరపెట్టు కున్నానని విలేకరులకు చెప్పింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పలాస పోలీస్ లు తన పిర్యాదు ను స్వికరించి, నా కుమారుడును ఇప్పించారని చెప్పింది. నా కొడుకు నా వద్దకు వచ్చాడనే సంతోషం ఎక్కువ సేపు మిగల్చలేదు. నీ కొడుకుని సుంకరి జగన్నాధపురం లోని తండ్రి వద్దకు పంపించాలని, ఆ ఊర్లో సంబరాలు ఉన్నాయని ఒకసారి, మరోసారి లోకేష్ తండ్రి కి బాగోలేదు మనవడు కి చూడాలంటు పలాస పోలీస్ స్టేషన్ నుండి తనకు ఫోన్లు మోత మొదలైందని, పోలీస్ ల అండ చూసుకొని భర్త లోకేష్ తనపై దాడి చేసి నా వద్ద ఉంటున్న నా కొడుకు ని తీసుకొని వెళ్ళిపోయినట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ప్రస్తుత సమాజంలో మహిళల కోసం కఠిన చట్టాలు వస్తున్నప్పటికీ మహిళలపై దాడులు, వేధింపులు ఆగడం లేదని ఆమె పేర్కొంది. ఇప్పటికైనా పోలీసుల స్పందించి తన కుమారుడిని అప్పగించాలంటూ పలాస, స్వామి వివేకానంద విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసింది.

భూముల రక్షణకై పోరు బాట పట్టిన ఆదివాసీలు



విశాలాంధ్ర - జలుమూరు : ఉద్యమాలు గడ్డగా పేరుగాంచిన శ్రీకాకుళం జిల్లా మళ్లీ నేడు ఆదివాసీలు జలుమూరులో సోమవారం భూముల రక్షణకై పట్టిన పోరుబాట నాటి ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చింది. జలుమూరు మండలం మర్రివలస పంచాయతీ ఎస్టీ మాకివలస ఆదివాసీలు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అంబేద్కర్ విగ్రహం నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు వందలాది ఆదివాసీలు మహిళలు, పురుషులు ర్యాలీలో పాల్గొని మా భూములకు రక్షణ కల్పించాలని పట్టాలు మంజూరు చేయాలని భూములను కాజేస్తున్న ఊన్న సత్యనారాయణ గుప్తా ఆయన సోదరుడు పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ర్యాలీలో నినాదాలు చేశారు. ఆయనకున్న 114 ఎకరాల భూములపై సి ఐ డి విచారణ జరిపించాలని నినాదాలు చేశారు. తాసిల్దార్ కార్యాలయం కు చేరి తాసిల్దార కు వినతిపత్రం అందజేశారు. ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబయోగి మాట్లాడుతూ ఎస్టి మాకివలస ఆదివాసీలకు సాగు చేస్తున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. తాసిల్దార్ మాట్లాడుతూ గిరిజనులకు న్యాయపరంగా చట్ట పరంగా అవకాశం ఉన్న అన్ని హక్కులను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆదివాసులకు న్యాయం జరిగే వరకూ పోరాటాలు ఆగవని అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు వంకల మాధవరావు డిమాండ్ చేశారు. వీరితోపాటు ఆదివాసి యువత పాపారావు, ఉత్తరయ్య, సోమశేఖర్, బొమ్మాలి పావని, కళ్యాణి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజి : 2
శ్రీకాకుళం
మంగళవారం 16, జులై 2024

క్షేత్ర సహాయకుల సమస్యలు పరిష్కారం జరిపించండి

ఎమ్మెల్యే మామిడికి క్షేత్ర సహాయకుల వినతి

విశాలాంధ్ర-మెళియాపుట్టి: మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకులుగా పనిచేస్తున్న మా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కు క్షేత్ర సహాయకులంతా కలిసి వినతిపత్రం అందించారు. సోమవారం మండలంలో మర్రిపాడు సి పంచాయతీలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే గోవింద రావుకు క్షేత్ర సహాయకులు కలిసి సమస్యలను తెలియపరిచారు. చెప్పారు. గత కొన్ని ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న మా ఈ సమస్యను ప్రస్తుత ప్రభుత్వంలో మాకు న్యాయం జరిగేలా కృషి చేయాలని వారు విన్నవించారు. క్షేత్ర సహాయకులు భాస్కరరావు, జగదీశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులున్నారు.

పచ్చదనంతోనే ప్రకృతి సంరక్షణ ఎమ్మెల్యే మామిడి

విశాలాంధ్ర-కొత్తూరు : పచ్చదనం తోనే ప్రకృతి ని సంరక్షణ చేసుకోగలం అని ఎంఎల్ఏ మామిడి గోవిందరావు అన్నారు. కర్లెమ్మ ఆర్ అండ్ ఆర్ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. సోమవారం కొత్తూరు మండలం,కర్లెమ్మ ఆర్ అండ్ ఆర్ కాలనీలో సర్పంచ్ పుచ్చ అప్పారావు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తో పాటు. వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు సోదరులు యువ నాయులులు లోతుగెడ్డ ఇందిరరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా . ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ, వంశధార నిర్వాసితులుకు ఎప్పుడైనా ఎలాంటి సమయాల్లో ఐనా ఏ ఆపదోచ్చిన నేను అండగా ఉంటానని ఆయన నిర్వాసిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం లో టీడిపి నాయకులు,ఎద్దు దాసు నాయుడు, ఎంపీటీసి వడ్డీ గౌరి కుమార్, . , సర్పంచ్లు లోతుగెడ్డ భగవాన్ దాస్ నాయుడు,కోయిలాపు శ్రీనివాసరావు, ఏ.శంకర్ రావు వలరౌతపోలినాయుడు. మాజీ సర్పంచ్ లు పడాల వెంకట కృష్ణ, ఎద్దు కన్నాం నాయుడు, అగతముడి మాధవరావు, టీడీపీ నేతలు , మాతల గాంధీ,టొంపల తిరుపతి రావు, అరుబోలు దశరథ రావు, పెదకోట ఆదినారాయణ, కలమట తిరుపతి రావు,తీమర జగదేశ్వరావు,కూన అర్జున, గవర ఉమ మహేశ్వరరావు, లోతుగెడ్డ రాంబాబు,బర్రి గోవిందరావు, పెద్దిన అమర్, కర్నాన రామారావు,శమ్మాన ఉదయ్ కుమార్,ఎంపీడీవో చక్రవర్తి,ఏపిఓ ప్రేమలత,మొదలగు వారు పాల్గొన్నారు.

జనసేన క్రియాశీల సభ్యత్వం నమోదు చేసుకోవాలి

జనసేన నియోజకవర్గ ఇంఛార్జ్, బలగ ప్రవీణ్‌కుమార్

విశాలాంధ్ర-నరసన్నపేట: నియోజకవర్గంలో జనసేన కుటుంబ సభ్యులంతా పార్టీ క్రియాశీల సభ్యత్వం నమోదు చేసుకోవాలని నియోజకవర్గ జనసేన ఇంఛార్జ్, బలగ ప్రవీణ్‌కుమార్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 18వ తేదీ నుండి సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమై, 28వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. ప్రతీ ఒక్కరూ పవనన్న భరోసా క్రియాశీల సభ్యత్వాన్ని సద్వినియోగం చేసుకొని, పార్టీలో సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని కోరారు.

103 మందికి నేత్ర వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-మందస: మందస సత్యసాయి సేవా సమితి (బృందావనం)లో జిల్లా అంధత్వ నిర్మూలన సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్య బృందం వారిచే ఉచిత నేత్ర వైద్య పరీక్షలు జరిగాయి. శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్య సహాయకులు చల్ల గిరిజ 103 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. 42 మందికి నేత్ర వైద్య చికిత్సలకు ఎంపిక చేశారు. క్యాంప్ ఇన్‌చార్జీ టి.రామారావు, సత్యసాయి సేవా సమితి కన్వీనరు సభ్యులు వూన ఈశ్వరరావు, సుంకరి శంకరరావు, బి.బైరాగి, బి.ఆనందరావు, వడ్డి అప్పారావు, జగబందు బెహరాలు పాల్గొనానరు.

రైతులకు ఎరువులు పంపిణీ

విశాలాంధ్ర-మందస : మండలం బాలిగాం రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు ఎరువులు మండల టీడీపీ అధ్యక్షులు బావన దుర్యోధన అందజేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ పావని, వెల్ఫేర్ అసిస్టెంట్ గంటా పాపారావు, బావన ఢిల్లీరావు, గున్న విక్రమ్, గున్న రఘుపతి, పందిరి రామారావు, పందిరి శ్రీనివాస్, గున్న ప్రశాత్, జయరామ్, చమళ్ల యోగిలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా యువజన సంఘం

విశాలాంధ్ర-పలాస: విద్యార్థుల కు ఉన్నత చదువులు చదువుకునేందుకు యువజన సంఘం అండగా నిలుస్తూ ఆర్థికంగా, సహాయ సహకారాలు అందిస్తున్నామని జగదీశ్వర సంఘం అధ్యక్షులు బొడ్డు కాంతారావు అన్నారు. మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన వలస కార్మికులైన అండమాన్‌లో జగదీశ్వర సంఘాన్ని ఏర్పాటు చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా సోమవారం 10వ తరగతి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు 16 మంది విద్యార్థులు, 7గురు క్రీడాకారులకు ఘనంగా సన్మానం చేశారు. అనంతరం వారి ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండమాన్ నికోబార్‌లో చదువుకున్న విద్యార్థులకు తమ సంఘం అండగా ఉంటుందని అన్నారు. ఎవరికి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో మద్దిల శంకరరావు, గేదెల ధర్మారావు, పోతనపల్లి కూర్మారావు, ఎం.వెంకట్, మద్దిల రమేష్, బైనపల్లి సుందరయ్యలు పాల్గొన్నారు.

రైల్వేశాఖ నుంచి మా భూములను కాపాడండి

విశాలాంధ్ర-సోంపేట: ఈ మండలం కొర్లాం గ్రామ పంచాయతీ పరిధిలో బారువ రైల్వేస్టేషన్‌కు ఆనుకుని ఉన్న కాలనీవాసుల స్థలాలను రైల్వేశాఖ ఆక్రమణల నుంచి కాపాడాలని బాధితుల తరపున స్థానిక సర్పంచ్ ప్రతినిధి రాంబుడ్డి గణపతి సోంపేట తహశీల్దార్ విజయ్‌కుమార్ సోమవారం వినతిపత్రం అందజేశారు. రైల్వేస్టేషన్ సమీపంలో రైతుల యొక్క భూములపై నుంచి రైల్వే అధికారులు ప్రహారీగోడ నిర్మాణం చేపట్టి సుమారు 5 మీటర్ల వరకు ఆక్రమించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. పేద రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రహారీగోడ నిర్మాణం పనులు వెంటనే నిలుపుదల చేయించి రైతుల భూములకు రక్షణ కల్పించాలని కోరారు. తహశీల్దార్‌ను కలిసిన వారిలో రైతులు మాధవరావు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రిన్సిపాల్ డాక్టర్ పేరాడ రాజేశ్వరరావు

విశాలాంధ్ర-కవిటి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పేరాడ రాజేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు శ్రమదానం చేపట్టి స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పేడాడ రాజేశ్వరరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అనే దృక్పథంతో ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు శ్రమదానం కార్యక్రమం చేయడం సంతోషించ దగ్గ విషయం అని అన్నారు. దానికి ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్ల కృషి ప్రశంసనీయం అని కొనియాడారు. కళాశాలలో పొదలు పెరిగిపోవడం వల్ల పాములు, గొంగళి పురుగు ఎక్కువగా పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్. పి.ఒ. జె. పాపారావు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దట్టమైన పొదలు తొలగించి ప్రజల ప్రాణాలు రక్షించండి

విశాలాంధ్ర-టెక్కలి: కొన్ని సంవత్సరాలు నుండి ఉన్న ఓ స్థలంలో దట్టమైన చెట్లు, పొదలు పెరిగి అడవిలా మారిందని, అందులో అడవి పందులు, పాములు సంచరిస్తున్నాయని వాటి నుండి రక్షించండి అంటూ గ్రామంలో ఉన్న ప్రజలు ఆవేదన వేడుకుంటున్నారు. వివారాల్లోకి వెళితే... టెక్కలి మండలం అయోధ్యపురం పంచాయతీ, సోమయ్యవలస ఎస్సీ కాలనీ పక్కనే ఉన్న ఓ మూడు ఎకరాల స్థలములో కొన్ని సంవత్సరాలుగా ఖాళీగా పడి ఉండడంతో దట్టమైన అడవిలా తయారైందని స్థానికులు తెలియజేశారు. ఆ స్థలములో పెద్ద పెద్ద చెట్లు, దట్టమైన పొదలు పెరిగి అందులో అడవి పందులు, విష సర్పాలు, క్రిమి కీటకాలు, సంచరిస్తున్నాయని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి అయితే ఆ పొదల్లో నుండి పెద్ద పెద్ద శబ్దాలు వినిపిస్తున్నాయని కాలనీ వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. వర్షం పడితే నీరు ఎటు వెళ్లక ఆ స్థలములోనే నిలవ ఉండిపోయి దోమలు, క్రిమి కీటకాలతో ప్రజలు డయేరియా, డెంగ్యూ, సీజనల్ వ్యాధులతో అనారోగ్య పాలవుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై సోమవారం కొంతమంది కాలనీవాసులు కలిసి స్పందనలో ఫిర్యాదు చేశారు. అనంతరం టెక్కలి సబ్ కలెక్టర్ తో కాలనీ వాసులు మాట్లాడి మా సమస్యని పరిష్కరించి కాలనీ వాసులను కాపాడండి అంటూ వినతి పత్రాన్ని సమర్పించారు.

అక్టోబర్ 2న అన్నా క్యాంటీన్ ప్రారంభం

ఎమ్మెల్యే రవికుమార్

విశాలాంధ్ర-ఆమదాలవలస: అక్టోబర్ రెండో తేదీ నాటికి అన్న క్యాంటీన్ ప్రారంభించ నున్నామని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నా రు. సోమవారం పట్టణంలోని అసంపూర్తిగా ఉన్న అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవనాన్ని నిబంధనల మేరకు ఇన్నోవేషన్ చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారి అప్పలనాయుడు ను ఆదేశించారు. ఈ క్యాంటీన్ ద్వారా పేదలకు అన్నం పెట్టడం జరుగుతుందని తెలిపారు. గతంలో అన్నా క్యాంటీన్ ప్రారంభించి పేదలకు అన్నం పెడుతున్న సమయంలో ప్రభుత్వం మారిందని వచ్చిన సైకో ఈ క్యాంటీన్ ను పూర్తిగా మూసివేశారని విమర్శించారు. పాత్రలు దాచుకునేందుకు అలాగే సామాగ్రిని భద్రపరుచు కునేందుకు ప్రత్యేక రూములు ఏర్పాటు చేయాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంగీకారం తెలిపిన తర్వాత అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తిచేసి అక్టోబర్ 2వ తేదీ నుంచి పేదలకు భోజన సౌకర్యం కల్పించనున్నట్లు వివరిం చారు. ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలోని అక్షయపాత్ర ద్వారా పేదలకు భోజన సౌకర్యం కల్పించనున్నట్లు ప్రభుత్వం అంగీకరించిందని రవికుమార్ తెలిపారు. ఈ కార్య క్రమంలో ఇంజనీరింగ్ అధికారులతో పాటు తెలుగుదేశం నాయ కులు పాల్గొన్నారు.

శిరస్త్రానంపై అవగాహన

విశాలాంధ్ర-సోంపేట: సోంపేటలో సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం శిరస్త్రానం (హెల్మెట్)పై ప్రజలకు అవగాహన కల్పించారు. న్యాయమూర్తి కోర్టు సిబ్బంది, లాయర్లతో కలిసి కోర్టు ప్రాంగణం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా హెల్మెట్లు పట్టుకుని ప్రజలకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే చాలా మంది ప్రతి రోజు హెల్మెట్లు ధరించక చిన్నపాటి ప్రమాదాల్లో కూడా మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాపాయం నుంచి కాపాడుకోవాలని కోరారు. ఒక వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం అంతా జీవితాంతం అభివృద్ధి లేక సంక్షేమం లేక నిరంతరం కుమిలిపోతూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దు సర్వేశ్వరరావు, సభ్యులు కె.గోవర్ధనరావు, ఏజీపీ బి.లక్ష్మీనారాయణ, గోపాలరావు, డి.జగన్నాయకులు, జగదీష్ పండా, కె.రాజు, కె.వి.వి.ప్రసాద్, సంస్కారభారతి డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి ఆధ్వర్యంలో ర్యాలీ:

ఇదే రోజున జూనియర్ సివిల్ జడ్జి కె.రాము ఆధ్వర్యంలో మరో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలోను హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లాయర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం జిల్లాకు గరిమెళ్ళ పేరు పెట్టాలి

మాజీ ఎమ్మెల్యే భూక్త ఆవేదన

విశాలాంధ్ర-పోలాకి: ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు స్వర్గీయ గరిమెళ్ళ సత్యనారాయణ 131 వ జయంతి ని పురస్కరించుకుని ఆయన స్వగ్రామం ప్రియాగ్రహారం లో గరిమెళ్ళ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో గరిమెళ్ళ ట్రస్ట్ అధ్యక్షులు హరిచంద్రపురం మాజీ శాసనసభ్యులు కె.ఏ.ఎన్. భుక్త, మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో సిక్కోలు కి స్థానం కల్పించిన గరిమెళ్ళ సత్యనారాయణ పేరు శ్రీకాకుళం కి పెట్టాలని డిమాండ్ చేశారు. గరిమెళ్ళ జయంతి, వర్ధంతులను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని వారు కోరారు.నాడు ఎన్నో వ్యయ ప్రయాసలకి ఓర్చుకొని ఉన్నత పాఠశాల కళాశాల మంజూరు నిర్మాణాలకు కృషి చేసినట్లు తెలిపారు.అయితే నేడు ఆశించినంత గుర్తింపు లేకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.నాడు గరిమెళ్ళ సత్యనారాయణ పడిన కష్టాలు నేడు ఎదుర్కొన్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం ఉన్నప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రులు మక్కువ చూపకపోవడం పట్ల చెందారు. గరిమెళ్ళ ట్రస్ట్ కార్యదర్శి బాడన రాజు మాట్లాడుతూ గరిమెళ్ళ పుట్టిన ఈ నేల మీద పుట్టిన ప్రతి ఒక్కరు ధన్యజీవులమని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సింహాభట్ల నాగ కుమారి, ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు విశ్వేశ్వర రావు లు మాట్లాడుతూ గరిమెళ్ళ పేరిట ఉన్న ఉన్నత పాఠశాల, కళాశాల లను అన్ని రకాలుగా అభివృద్ధికి సహకరించాలని గ్రామ పెద్దలను కోరారు. సుదూరం నుండి వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం బోరుభద్ర నుండి ప్రత్యేక బస్సు నడపాలని వారు కోరారు. ఇంటర్, పదవ తరగతి లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు సీపాన అనూష, దుద్దు భార్గవి, బూరెల్ల నవ్య,టెంక .రోహిణి లకు ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతులు ప్రదానం చేయడం చేశారు. ఈ కార్యక్రమంలో గరిమెళ్ళ ట్రస్ట్ అధ్యక్ష,కార్యదర్శులు కె.ఏ. ఎన్.భుక్త,బాడాన రాజు, మాజీ సర్పంచ్ లావేటి కృష్ణా రావు,ట్రస్ట్ సభ్యులు దుబ్బ కోటేశ్వర రావు, ఐ. గణపతి రావు,మద్దు అప్పల రాజు, రామారావు, మద్దు అప్పయ్య, గరిమెళ్ళ సత్యనారాయణ ఉన్నత పాఠశాల తల్లిదండ్రుల కమిటీ మాజీ అధ్యక్షులు సుంకరి ఆదినారాయణ పంచాయతీ మెంబర్ ప్రతినిధి సుంకరి అప్పన్న కళాశాల ప్రిన్సిపాల్ నాగకుమారి ,ప్రధానోపాధ్యాయులు విశ్వేశ్వర రావు, నాగేంద్ర, గోపి, ధనుంజయ రావు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు,ప్రజలు పాల్గొన్నారు.

జిల్లా ప్రజల, పోలీస్ సిబ్బంది సహకారం మరువలేను : ఎస్పీ రాధిక

ఘనంగా సత్కరించిన జిల్లా సాయుధ దళ విభాగం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: సార్వత్రిక ఎన్నికల్లో ఆర్మ్ పోలీస్ విభాగం అధికారులు, సిబ్బంది, జిల్లా ప్రజల సంపూర్ణ సహకారం అందించడం వలన ఎన్నికలు ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించగలిగామని వారి సహకారాన్ని మరువలేనని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక, కొనియాడారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా జి ఎస్పీ జి.ఆర్.రాధిక రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయానికి బదిలీ పై వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఎచ్చెర్ల ఆర్మ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో ఆర్మ్ రిజర్వ్ యాత్రంగం ఆధ్వర్యంలో లో సెరెమోని పరేడ్ నిర్వహించి ఎస్పీకి గౌరవ వందనం సమర్పించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ క్రమంలో ఎస్పీ పోలీసు పరేడ్ ను పరిశీలించి అభినందించారు. జిల్లా ఆర్మ్ పోలీసు యంత్రాంగం జిల్లా ఎస్పీ ని శాలువ తో సన్మానించి జ్ఞాపిక ను బహుకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాధిక మాట్లాడుతూ జిల్లాలో సుమారు రెండున్నర సంవత్సరాలు పని చేయడం జరిగిందని జిల్లా ప్రజలు పోలీసు సిబ్బంది అందరు సహాయ సహకారాలు అందించారని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా శాంతి యుత జిల్లా అని ఎక్కడికి వెళ్ళినా జిల్లా లో ప్రజలని, పోలీసు అధికారులను సిబ్బందిని మర్చిపోలేని అన్నారు. ప్రతి ఒక్కరూ అంకిత భావం తో నిబద్ధతతో మరింత ఉత్సాహంతో విధులు నిర్వహించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్ కాజల్, డిఎస్పీ లు, సిఐలు,ఎస్ఐ లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం సిబ్బందికి టీడీపీ నేతలు సన్మానం

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి: కంచిలి మండలం పెద్ద శ్రీరాంపురం గ్రామ సచివాలయం సిబ్బందిని స్థానిక టీడీపీ నేతలు సోమవారం ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెలలో 1వ తారీఖున తొలిరోజునే 99 శాతం సామాజిక పింఛన్లు పంపిణీ విజయవంతం చేసినందుకు గాను సచివాలయ సిబ్బందిని సన్మానించి అభినందించినట్లు గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నేత మాదిన రామారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరరావు, కాళి ప్రసాద్, సంజీవ్, భుజంగరావు, గంగాధర్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యం

హెచ్ఎం సీతం నాయుడు

విశాలాంధ్ర-కవిటి: పరిసరాల పరిశుభ్రత తోనే ప్రతి ఒక్కరికి ఆరోగ్యం నెలకుంటుందని ప్రధానోపాధ్యాయుడు వి సీతమ్మ నాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం గొర్లెపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులచే పారిశుద్ధ్య కార్యక్రమం పేరిట చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు సీతమ్ నాయుడు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డయేరియా,మలేరియా,డెంగ్యూ వంటి విష జ్వరాలు ప్రబలకుండా వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని ఈ చైతన్య ర్యాలీని నిర్వహించడం జరిగిందని తెలిపారు.విద్యార్దులకు మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేస్తూ,మంచినీటి ట్యాంకులు క్లీన్ చేయించి క్లోరినేషన్ చేయించుకోవాలని అలాగే మన చుట్టూ ఉన్న పరిసరాల్లో ఎక్కడైనా నీటి నిల్వలు ఉన్నచో నీరు నిల్వ ఉండకుండా ఉండేవిధంగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఏఎన్ఎం లు, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

ఫిర్యాదులను స్వీకరిస్తాం... పరిష్కారిస్తాం.

విశాలాంధ్ర-హిరమండలం: ప్రజలు అందజేసే ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ డి డి స్వరూపరాణి, తహసీల్దార్ సుధాకర్, ఎం ఈ ఓ కిల్లారి రాంబాబు లు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం లో తహసీల్దార్ ఛాంబర్ లో ప్రజా పిర్యాదుల నమోదు మరియు పరిష్కారవేదిక కార్యక్రమం మండలస్థాయి అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలస్థాయి అధికారులు మాట్లాడుతూ ప్రజలకు సమస్యలు ఏమీ లేనట్లు గా ఉన్నారు. పిర్యాదులు కార్యక్రమం ప్రతీ సోమవారం నిర్వహిస్తున్నప్పటికీ వినతులు అందడం లేదని పిర్యాదులు వస్తే పరిస్కారం కొరకు చర్యలు తీసుకొంటామని మండలస్థాయి అధికారులు తెలిపారు. ఇక నుండి అయినా మండల ప్రజలు మండల కేంద్రం హిరమండలం లోని ఎంపీడీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యలయం లో ప్రతీ సోమవారం నిర్వహించు ప్రజా పిర్యాదుల కార్యక్రమం వినియోగించుకుంటారని ఎంపీడీఓ తహసీల్దార్ పత్రికా ముఖంగా తెలిపారు.

ప్రతిభ కనబరిచిన పూర్వపు విద్యార్థినికి సత్కారం

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వపు విద్యార్థినీ మార్పు సాయి స్ఫూర్తి ఐఐటీ కి ఎంపికైన సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సనపల రామకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.విద్యార్థిని సాయిస్ఫూర్తికి ఉన్నతంగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులు మార్పు బిందు మాధవి, వెంకటేశం లకు అభినందించారు. విద్యార్థిని సాయి స్ఫూర్తితో పాటు తండ్రి వెంకటేశం కు ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ మాట్లాడుతూ 2022 విద్యా సంవత్సరంలో స్కూల్ టాపర్ గా అలాగే విద్యాదాన్ స్కాలర్షిప్ 60 వేల రూపాయలు అందుకున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ తిరుమల కాలేజీలో 50వేల రూపాయలు నగదు బహుమతి పొందినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్లో 985 మార్కులు సాధించిందని అన్నారు. తొలి ప్రయత్నం లోనే జేఈఈ అడ్వాన్స్ లో ర్యాంకు సాధించి గౌహతిలో ఐఐటి సీటు సంపాదించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ పరిరక్షిద్దాం : ఎమ్మెల్యే మామిడి

విశాలాంధ్ర-మెళియాపుట్టి: వాతావరణ సమతుల్యం పాటించే క్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరం పరిరక్షిద్దామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. సోమవారం మెళియాపుట్టి మండలంలో గల జలకలింగు పురం గ్రామంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో మొక్కలు నాటి, వాటిని సంరక్షించి కాలుష్య రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిధిలో 12 వేల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సమయత్వం చేసినట్టు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే గోవిందరావు తోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

దేవాలయానికి సీలింగ్ ఫ్యాన్లు వితరణ

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని బొరివంక గ్రామంలో వెలసి ఉన్న అసిరి పోలమ్మ తల్లి అమ్మవారు దేవస్థానానికి రెండు సీలింగ్ ఫ్యాన్లు వైసిపి మహిళా జోనల్ ఇంచార్జ్, విశ్వాస్ స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షురాలు బెందాళం పద్మావతి బహుకరించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సర్పంచ్ బెందాళం శ్రీరామ్ ప్రసాద్ కు దేవాలయ ఆవరణంలో ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలోమండల పరిషత్ వైస్ చైర్మన్ పూడి నేతాజీ, విశ్రాంత డిఎస్పి ఎస్ వి వి ప్రసాద్ రావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు బెందాళం విజయ్ కుమార్, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అవినీతి అక్రమాలకు నిలయం... మందస సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం..!

విశాలాంధ్ర-మందస: మందస సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతి అక్రమాలకు నిలయంగా తయారయింది. ఈ కార్యాలయంలో భారీ స్థాయిలో అక్రమ రిజిస్ట్రేషన్లు, అక్రమ వసూళ్లు జరుగుతున్న సంబంధిత శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించి ఇక్కడ కార్యాలయం ఉద్యోగులకు మద్దతు పలుకుతున్నారని ప్రచారం జరుగుతుంది. పట్టాదారు పాస్ పుస్తకాలు, అడంగల్ చూడకుండా అనుమతి పత్రాలు లేకుండా ప్రభుత్వ నిషేధిత అక్రమంగా రిజిస్ట్రేషన్ జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఈ రిజిస్ట్రార్ కార్యాలయంలో సుమారు 600 ఎకరాలు అసైన్డ్ భూములు అక్రమంగా రిజిస్ట్రేషన్లు అయినట్లు ఆరోపణ వినిపిస్తున్నాయి. వీటిలో దేవాదాయ శాఖ భూములు, మందస మండలంలోని సముద్ర తీరంలో ఉన్న అటవీ శాఖకు చెందిన భూములు, ఆంధ్ర ఒడిశా భూ భాగంలో ఉన్న అటవీ శాఖ భూములు రిజిస్ట్రేషన్ చేసిన వాటిలో ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనలకు భిన్నంగా, చట్ట విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు జరిగాయన్న ప్రచారం జరుగుతోంది. హున్నాలి గ్రామ సమీపంలో ఉన్న 30 ఎకరాలు చట్టవిరుద్ధంగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. బుడార్ సింగి, తాళ్ల గురంటి, సాబకోట, చీపి, హంసరాళి, భోగాబంద, కొంకడా పుట్టి, కొండలోగాం తదితర గిరిజన పంచాయతీల పరిధిలో గిరిజనుల సాగు హక్కు లో ఉన్న వందలాది ఎకరాలు భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూకబ్జాదారులు దౌర్జన్యంగా ఆక్రమించి ఇతర జిల్లాలకు చెందిన పారిశ్రామికవేత్తలకు మందస రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసి అక్రమంగా అమ్మేశారు. దీంతో గిరిజన ప్రాంతంలో భూ వివాదాలు నిరంతరం సాగుతున్నాయి. గిరిజనులకు గిరిజనేతరులకు అప్పుడప్పుడు ఘర్షణలు జరుగుతున్నాయి. ప్రతిరోజు అక్రమ రిజిస్ట్రేషన్ల తో కొనుగోలు అమ్మకం దారులతో ఇక్కడ కార్యాలయం కిటకిటలాడుతోంది. కార్యాలయం ఉద్యోగులు, మధ్య దళారులు ప్రతిరోజు లక్షల్లో ఆర్జిస్తున్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ లతో ప్రజలు తీవ్రంగా మోసపోతున్నారు. ముఖ్యంగా తప్పుడు సర్వే నంబర్లు, నకిలీ నోటరీ సర్టిఫికెట్ల లో నమోదు చేసి భూముల రిజిస్ట్రేషన్ లు జరుగుతున్నాయన్న ప్రచారం జరుగుతోంది. భూముల రిజిస్ట్రేషన్ లతోపాటు రెవిన్యూ శాఖ గాదులకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాలు జరాయితీగా మార్చి రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. పక్కా భవనాలు రిజిస్ట్రేషన్ చేసి ప్రభుత్వానికి ఖాళీ స్థలాలు రిజిస్ట్రేషన్లు చేసినట్లు తప్పుడు లెక్కలు చూపిస్తున్నారు. సాధారణ రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వ ఫీజు కన్నా మూడు రెట్లు అధికంగా డబ్బులు ఫీజు రూపేణ వసూళ్లు చేస్తున్నారు. అవినీతి ఆరోపణలు ఉన్న సబ్ రిజిస్ట్రార్ లను అప్పుడప్పుడు జిల్లా కార్యాలయానికి సరెండర్ చేస్తుంటారు. మళ్లీ ఇవే ఆరోపణలు ఎదుర్కొంటున్నా ఇదే ఉద్యోగుల్ని ఇక్కడ కొనసాగిస్తుండడం చర్చనీయాంశం మారుతుంది.